# అరచేయి

## బలివాడ కాంతారావు

మా గ్రామంలో నేను మంచి పేరు తెచ్చుకోడానికి కారణం నా చదువు కాదు, ఉద్యోగం కాదు, కథలు అంత కన్నా కాదు, అందరి అరచేతులు చూసి అపూర్వంగా భవిష్యత్తు చెప్తానన్న నమ్మకం. నా భవిష్యత్తు గురించి తెలుసుకోవాలన్న వుబలాటంతో, కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో ఈ చేతులు చూసే జబ్బు అలవడింది. అదో నల్లమందు అలవాటులా వదలకుండా, ఈనాటికీ మోతాదు పెరుగుతూ వస్తోంది.

ఆ మధ్య మా గ్రామం చాలా కాలం తరువాత వెళ్ళాను. మధ్యాహ్నం వూరి మీద పడి అత్తలనీ, వదినలనీ, మేనకోడళ్ళనీ, మరదళ్ళనీ, మామ్మలనీ– అన్నీ పరిచయమున్న గొంతుకలే కాదు, చిరునవ్వుతో అపూర్వంగా ఆదరించే వాళ్ళని, అందరి అరచేతుల గీతల లోని గూఢార్థాలను కనుగొన్న వాడిని కాబట్టి అతి చనువుగా మాటాడుతూ కదిలాను.

"రంగికి పిల్లలు దక్కరన్నాడు బాబూ, అంతే—యెక్కడ దక్కారు?"

"సిమ్మడి సెయ్యిసూసి, యిడాకులు తెగిపోతాయన్నాడు తెగిపోనాది కాదా?"


"బాబూ! యెప్పుడు సచ్చిపోతాను సెప్పి...." అని ఒక ముసలావిడ అర చెయ్యి యెదురుగా పెడ్తే అరచేతులు ముడుచుకున్న బింకంగా వున్న అతివలు కూడా పువ్వుల్లా చేతులు విప్పారు.


ఇలా కదులుతూ పోతే అంతదూరం నించే రెండస్థుల యింటి వాకిలినించి అప్పమ్మత్త "అల్లుడూ యెప్పుడొచ్చా" వని కేకేస్తూ ముందుకొచ్చేసింది. ఆ నవ్వుతో నల్లగున్నా నక్షత్రంలా మెరుస్తోంది. ఎదిగిన పిల్లలున్నా అప్పుడే పాలు పడిన బాలింతరాల్లా వుంది.

"అప్పుడు నువ్వు సెప్పినట్టే మేడ కట్టాం. మళ్ళా మీ మావఁ సెయ్యి సూసి ముందున్న సిరివైనం సెప్పవా?" అంది.

ఇలా అనగానే నర్సునాయుడు ఒక్క తుమ్ముతుమ్మాడు. అప్పమ్మ అదిరిపడి "మేడ కట్టాక మీ నాయుడు మావఁవి మైనం ముక్కయిపోనాది" అంది.

నాయుడు అరచేతిని నా చేతికి అందించాడు. అక్కడే వరండా ప్రక్క గోడకు






ఒక పెద్ద అరచేయి బొమ్మ అంటించి వుంది.

" ఆ సేతికున్న గీతలు యీ సేతికున్నాయో నేవో చూ స్తన్నవా?"అన్నాడు నాయుడు.

నేను అత్తవేపొకసారి చూశాను.

"పట్టిందల్లా బంగారం, ముట్టిందల్లా ముత్యం అయ్యే రోజు లెప్పుడొస్తాయో సెప్పు అల్లుడా?" అంది.

"గీతలు చూసి సెప్పినోళ్ళు, గద్దెక్కినోల్లూ నానుస్తారు. నా కది యిష్టం నేదు ఖచ్చితంగా సెప్పు. నా సేతిలో యెమ్మెల్లే అయ్యే గీత వుందో, లేదో?" అడిగాడు నాయుడు.

"అత్తా! నాయుడు మావయ్య యింట్లో మజ్జిగ తాగుతాడా?" అడిగాను.

"అది నేకపోతే యేదెక్కిపోతాడు."

"ఇంటి దగ్గర మజ్జిగ తాగి, యీదిలో ముసుగేసుకుని కళ్ళుకొట్టుకెళ్ళి,పట్నంలో బ్రాందీ షాపు లో దూరుతాడో, లేదో ముందు ఖచ్చితంగా సెప్పమను. నేను ఖచ్చింతగా యెమ్మెల్లే అవుతాడో, లేదో చెప్తాను."

నాయుడుకి కోపం వచ్చినట్లుంది. అర చేతిని ముడుచుకుంటూ లాక్కున్నాడు.

"ఉన్న నిజం ఒప్పుకోనివాడివి, వూహించి చెప్పేది నిజమని బల్లగుద్ది యెలా వప్పించగలను నాయుడు మావా?" అని లేచిపోయాను.

ఇంకా ముందుకు పోతే కోమటి ముత్యాలు కాఫీకొట్టు దగ్గరరోడ్డుప్రక్కనే పట్టుకున్నాడు. కాఫీ తాగితేగానీ వదల్లేదు. ముత్యాలు పెళ్ళాం రత్నాలు హోటల్లో వంట యింటి నించివచ్చి, విభవము తెచ్చే విత్తం యెప్పటికి కూడుతుందోనని మొగుడి అరచేతిని విప్పి నా ముందు పెట్టింది.

"బాబూ! పేదోడిగా బతకడం పాపం! ఆడిమీదే పెద్దపిడుగు పడతాది. ఈ పీనుగు బతుకుపోయి యేనుగు బతుకెప్పుడొస్తాదో?" అన్నాడు ముత్యాలు. ఆ అర చేతిని చూస్తూ కాఫీహోటలు తడికలమీద అంటించిన అరచేతిలోపోస్టరుని చూశాను.

"ఆ బొమ్మలాంటి గీత యీ సేతిలో వున్నాదో, లేదో సూడుబాబూ" అంది రత్నాలు.

చెయ్యి చూసి.

"నీది పీనుగు బతుకన్నావు-నీ చెయ్యి మాత్రం అలా అనిపించలేదు. నిన్ను మెప్పించిన వాళ్ళ చేతినే, నివ్వెక్కిన సవారీ మొయ్యించుకుంటున్నావు."

"అమ్మతోడు ఆ యింటి ముక్క, రత్నాలు ఒంటినున్న బంగారం తప్ప ఒక్కసెంటు ఆస్తి లేదు."

"వ్యాపారస్థుడికి భూవసతెందుకు?"

"వ్యాపారం అంటే యేమిటి? సాగినన్నాళ్ళు కూడినది, సాగని ఒక్కరోజులోనే హారతి కర్పూరంలా మండిపోతాది. శ్వాస వుండేవరకూ ఆశతో బతకడానికి ఒక్క గోడసేరువు సరిపోతాదా?"

"ముత్యాలూ! అరచేతిలో వెన్న పెట్టుకొనే నేతికెందు కేడుస్తున్నావయ్యా?" అన్నాను.

"అవలక్షణాలు చెప్పించుకోడానికి అర చేయి చూపించడమెందుకులే" అని చెయ్యి ముడుచుకుని తీసుకున్నాడు.

కదలిపోతుంటే బంగారంలో పొదిగినట్లున్నరత్నాలు, రాగి రంగుతో రాచబిడ్డలా వున్న రత్నాలు విచారంగా "ఇంతకు ముందు బాబు యెంత చెప్పాడో అంతా అయ్యింది. ఇప్పుడు ముందుగతి తెలుసుకుని సంతోషిస్తాననుకున్నాను." అంది.

వెనుకకు రెండడుగులు' వేసి "మరదలా! ఈచేతులుచూసేరహస్యం నీకు చెప్తున్నానువిను.నీ మొగుడుముత్యాలుఆ రోజు పీనుగులా గున్నానని నిజంచెప్పాడుకాబట్టి నా నోట ఆ రోజు పలికిన పలుకులూ నిజమయాయి. ఇప్పుడు అబద్ధం పలికాడు అంచేత నేను పలికిన పలుకులూ అబద్ధమైపోతాయి. చెయ్యిచూసి లాభమేమిటి?" అంటూ కదిలిపోయాను.

ఇలా చేతులు చూస్తూపోతున్నాను, ఇక చాలిద్దామనేసరికి వసంతు పట్టేశాడు. ఎక్కడ? సారాకొట్టుదగ్గర రోడ్డుమీద వెళ్ళిపోతుంటే కొట్టువదిలి మరీ పరుగెత్తుకొచ్చి లోపలకు బలవంతాన లాక్కుపోయాడు. అప్పుడే పొద్దు యెరుపెక్కడానికి సిద్ధంగా వుంది.

"కితంమాటు వచ్చినప్పుడు సెప్పినావుకదా? మంచిరోజులు ముందుకున్నాయని-ఏడాది దాటనేదు-కళ్ళుకొట్టు పోయి యీ సారాకొట్టు యెతుక్కుని వచ్చినట్లు వచ్చినాది. బాబూ! డబ్బు పుచ్చుకోవు. సారా తాగవు. నీ ఋణంలో వుంటాను. ఒక్కసారి సెయ్యిసూసి యీ వూర్లో బ్రాందీషాపు యెప్పుడు పెట్తానో సెప్పేద్దూ?"

సారాకొట్టు గోడకు అంటించిన అర చేతి పోష్టరుని చూస్తూంటే.

"అలాంటి .అదుష్టమైన గీత యీ సేతిలోనూ వుందేమో సూడు. నాలాటోలు యెందరు అధికారం సెయ్యనేదు?"

బ్రాందీషాపు గురించి మరిచిపోయి. అధికారం కోసం ప్రాకులాడుతున్నాడే అని ఒకసారి ఆ మోటు మనిషి ముక్కు

చూసి.

"ఆ ముక్కుతో మొగలిపువ్వు వాసన చూడకుండా అధికారం కంపు యెందుకు తగిలించు కుంటా"వన్నాను "అధికారం కంపా? అవ్వ.... అధికారం వుంటే అర్ధ రాత్రిమీద గొడుకు పట్టించుకోగలం— ఆ గీత వుందన్న ఆశతోనే అరచేతి బొమ్మను గోడకంటించి, కల్లు కొట్టు కొచ్చిన పెతివోడి వోటు కొనేశాను."

"అబద్ధం— అబద్ధం .. " అని యెవరో అరిచారు. ఆ అరిచినవాడు చేత బుడ్డితో నలుగురు మధ్య కూచ్చున్న నాగన్న.

"ఊరుకోరా నాగన్నా!" అరిచాడు వసంతు.

"అబ్బే! ఈ నాగన్న పడగెత్తేసి నాడు. సొన్నాయి స్వరంలా బాబు గొంతు వినిపిస్తొన్నది. బాబూ...." అంటూ నా దగ్గరగా వచ్చేసి:

"ఈ యేళ ఈ గ్రామంలో కొన్ని వందల చేతులు సూసినావట! ఈ వూరి రామాయణం అంతా తెలుసుకున్నావన్న మాట! సెప్పు— నిజం సెప్పు ఈ వూర్లో రావణాసురుడి సెయ్యేవరిది?"

వసంతుకి కోపం వచ్చింది.

"నా సెయ్యి సూడనీరా యెదవా"

"నీ సెయ్యే సూడాలా? ఎదుటోల సెయ్యి సూడొద్దా?"

"యెదవా — యెర్రెర్రిగా వాగక."

"నాకన్న నివ్వు గొప్పోడివేటి?"

"గొప్పోడిని అవునో, కాదో చూపించ మంటావా?"

"నబబు మాటాడి నీ గొప్ప సూపించరా! జులుంతో చూపిస్తే నీ గొప్పే ముందిరా? మనిషి పశువుల్లో జమై పోతాడురా!"

"ఊరుకుంటావా లేదా?" గద్దించాడు వసంతు.

"నాకూ ఒక్క వోటు? నీకు రెండు ఓట్లున్నాయా సెప్పు— ముందు నీ సెయ్యి సూడ్డానికి ఒప్పుకుంటాను."

"మనిషికి ఒక్క ఓటే."

"అలాగైతే యిద్దరం సరి సమానులం కదా!"

"ఎచ్చు తగ్గులు లేకపోతే లోకం నడదురా యెదవా?"

"ఏటీ? నడదా? నివ్వు నవ్వకండా యింద్రలోకం లోనికి యెగిరిపోతావేటి? నివ్వు నాలాగే బుగ్గవుతావు."

నా వేపు నాగన్న తిరిగి:

"బాబూ యీ గీతల బాసలు తెలుసుకుని సెప్తన్నావంటే నిజానికి మించిన నిజం నీ బుర్రలో గూడుకట్టుకుని వున్నాది కదా! నిజం సెప్పు — బతికినన్నాళ్ళు ఎంత గొప్పోడవనీ-ఎంత పేదోడవనీ ఓటుఒక్కటే కదా! సచ్చిన్నాడు యిద్దరూ బుగ్గిలో కలవవలసిందే కదా? మరి యీ యెచ్చు తగ్గులేల యీ వసంతుగాడు తెస్తున్నాడు? నిజంసెప్పు"

నివ్వు చెప్పింది నిజమే నాగన్నా" అన్నాను.

వసంతు నా యెదరగావున్న అరచేతిని ముడుచుకుని లాక్కున్నాడు.

"నాసెయ్యి ముందు సూడు" అని నాగన్న తన అరచేతిని నాముందుపెట్టాడు. కాస్సేపు పరీక్షగా చూసి—

"ఏవిషయంచెప్పాలి?"అని అడిగాను.

"ఆ గొప్పోలందరికీ యేదేటి సెప్పావో యీడికీ అదే సెప్పేబాబో" అని నాగన్న డబ్బుతో తాగుతున్న ప్రక్కవాడు సహాయపడ్డాడు. నాగన్న పాములా బుస్సన్నాడు

"యెదవా—ఎల్లప్పుడూనానూ, నా జతుకూ నా సుకం, నా పిల్లాజెల్లా—ఈ ఆరాటం. ఆకలితో మేకమెడ చన్నులు కుడిసీబతుకులకి నీతేమిటి, నిజమేమిటి తెలుస్తాదిరా? బాబూ— సూడండి, బాగా సూడండి. ఈ అరిచేతిలో తన మేలు మరసి యెదుటోడికి మేలుసేసీ గీతుందో. లేదో సెప్పండి"

అలా కాసేపు చూసి అన్నాను:

"నాగన్నా! ఈ వేళ యీ గ్రామంలో ఒక వంద చేతులు చూసుంటాను, అన్ని చేతుల్లోనూ నీదే గొప్ప చెయ్యి."

"నేనన్న గీత వుందా బాబూ?"

"ఉంది."

"నివ్వు అబద్ధం సెప్పవులే— అంతే సాలు. వసంతు నీ యిష్టం సూపించుకో.." అంటూ లేచిపోయాడు నాగన్న. వసంతుకి కోపం తగ్గలేదు. అప్పుడే పొద్దుక్రుంగిపోయింది నేను తిరిగి వెళ్ళిపోవస్తుంటే:

"బాబ్బాబూ...." అన్న కేకలు వినిపించి, తిరిగి చూశాను. చేతిలో యేదో పట్టుకుని పరుగెత్తుకొచ్చాడు నాగన్న. "నా పురిపాక వూరి మధ్యన భజన మందిరం దగ్గిరుంది కదా! ఈ కాగితం ఆ మట్టిగోడకి అంటించమని ఐదు రూపాయలు ముడుపు కట్టి మరీ యిచ్చాడు వసంతు. నాచేతిలో వున్నలాంటి గీత యీ అరచేతి బొమ్మలో వుందో, లేదే సూస్తావా బాబూ!" అంటూ ఆ బొమ్మ విప్పి తన కుడి అరచేతిని చాశాడు.

"ఆ గీత లేకపోతే నీ గోడకు అంటించవా?"

"అంటించను."

"నాకు బొమ్మల చేతులు చూడటం చాతకాదు- ఏమీ అనుకోక!"

"అలాగ తెంపిస్తే యెలాగ? ఈ బొమ్మ యెవరో మనిషి అరచేతి బొమ్మే కదా! సెప్పందినిన్ను వదలను"అంటూ అడ్డంగా నిల్చున్నాడు.

"ఒకటి చెప్పగలను."

"ఏదో ఒకటి సెప్పు."

"ముందు దారి వదులు."

నాగన్న ప్రక్కకు జరిగాడు.

"ఈ బొమ్మతో వ్యాపారం చేస్తున్న వసంతు చేతిలో మాత్రం నివ్వన్న గీత లేదు" అంటూ ముందుకు జరిగాను. నాగన్నకు అర్థమైనట్లుంది. అందుకే నా త్రోవకు అడ్డుగా నిల్చోలేదు. ●

